క్లుప్తంగా

దళితబంధు యూనిట్ ప్రారంభం

హుజూరాబాద్: పట్టణంలో దళితబంధు యూనిట్‌ను బుధవారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రారంభించారు. కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన అన్నపూర్ణమారయ్యకు దళితబంధు యూనిట్ మంజూరైంది. ఈకార్యక్రమంలో సలీం, సురేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సెప్టెంబర్ 3న సన్‌షైన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిర పోస్టర్‌ను బుధవారం సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు ఆవిష్కరించారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచ్ రోడ్డ పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ నెల్లి మురళి, డాక్టర్ సుశాంత్, సురేశ్, డీజీఎం సతీష్, బీడియం నాగరాజు పాల్గొన్నారు.

మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


మానకొండూర్: మండలకేంద్రంలో బుధవారం మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. వట్టి జానయ్యయాదవ్‌పై అక్రమ కేసులు, దాడికి నిరసనగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బోనగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే మంత్రి జానయ్యయాదవ్‌పై దాడి చేయిస్తున్నారని, అక్రమ కేసులతో జైలుకు పంపాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంద బాలయ్య, జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కి బాలకిషన్, జిల్లా కార్యదర్శి కుమ్మరి సంపత్, వెంకన్నగౌడ్, జిల్లా కార్యవర్గసభ్యులు పెద్దోళ్ల శ్రీనివాస్, మండల అధ్యక్షులు దాసరి కొమురయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయపాల్‌రెడ్డికి స్వాగతం


జయపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీలో చేరిన పారిశ్రామికవేత్త కొత్త జయపాల్‌రెడ్డి తొలిసారి జిల్లాకు వస్తున్న సందర్భంగా బుధవారం గుండ్లపల్లి స్టేజీ వద్ద గుండ్లపల్లి, గునుకులకొండాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆయనకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో విజయ భాస్కర్‌రెడ్డి, బెతెల్లి రాజేందర్‌రెడ్డి, చింతల పర్శరాం మాజీ ఉప సర్పంచ్ కాల్వ కొమురయ్య, వంగాల సత్యనారాయణరెడ్డి, వంగాల రవీందర్‌రెడ్డి, నందికొండ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో ఎల్లో డే


ఎల్లో డేలో పాల్గొన్న విద్యార్థులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి పాఠశాలలో బుధవారం ఎల్లో డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లో డే ఆవశ్యకతను పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటనారాయణ, ఎంపీటీల సంఘం మండల అధ్యక్షులు ఎడవెల్లి పాపిరెడ్డి, పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి, భూమయ్య, సుమలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



మానకొండూర్: మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సృజన వివాహానికి బుధవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు యాభై కిలోల బియ్యం, చీర అందజేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. ఈకార్యక్రమంలో కార్యకర్తలు రమేశ్‌పటేల్, శ్రీనివాస్, ప్రదీప్, సురేష్, వరప్రసాద్ పాల్గొన్నారు.

అందని పరిహారం.. దక్కని పునరావాసం

- కొండన్నపల్లి గ్రామస్తుల ఆవేదన
- కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై నిర్వాసితుల ఆందోళన


అదనపు కాలువ నిర్మాణంలో కోల్పోయే ఇళ్లు


పరిహారం కోసం ఆందోళన చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)

గంగాధర: అదనపు టీఎంసీ నీటి తరలింపునకు మీ ఊరు భూములు కావాలి.. కాలువ పక్కన ఉన్న ఇళ్లు సైతం పోతాయి, భూ సేకరణకు సహకరించాలని అధికారులు గ్రామానికి వచ్చారు. ఇప్పటికే వరదకాలువలో భూములు కోల్పోయాం మరోసారి భూములు ఇవ్వం, ఇళ్లు ఖాళీ చేయమన్నాం అధికారులు మాత్రం మమ్మల్ని బుదరకిచ్చిండ్రు, గతంలోకంటే పరిహారం ఎక్కువిత్తమన్నరు. ఇళ్లు కోల్పోయే వాళ్లకు పరిహారంతో పాటు పునరావాసం కల్పిస్తామన్నారు. ఒప్పుకోక పోతే బెదిరించిండ్రు, పోలీసు బందోబస్తుతో సర్వే కు వచ్చింఁద్రు అయినా వినకపోతే మీ ఇష్టం మీరంతా కోర్టుకు పోవాల్సి ఉంటదన్నారు. వీళ్లు వదిలేటట్టు లేరని ఇళ్లు, పొలాలు ఇవ్వడానికి ఒప్పుకున్నాం.. రెండేళ్లు కావత్తుంది. కాలువ పనులు చాలు చేసిండ్రుగాని పరిహారం పైసా ఇవ్వలేదు. పునరావాసం ఊసే ఎత్తడం లేదని మండలంలోని కొండన్నపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తుండ్రు. వెంటనే పరిహారం మంజూరు చేయాలని నిర్వాసితులు ఇటీవల కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ఆందోళన సైతం నిర్వహించారు.

మండలంలోని బూర్గుపల్లి సమీపం నుంచి మిడ్ మానేర్ డ్యాం వరకు ఉన్న వరదకాలువ సమీపం నుంచి అదనపు టీఎంసీ నీటిని తరలించడానికి మరో కాలువ నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం భూసేకరణ సర్వే నిర్వహించారు. ఇందులో మండలంలోని కొండన్నపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని న్యాలకొండపల్లి రెవెన్యూ పరిధిలో దాదాపు వంద ఎకరాలు, కురిక్యాల రెవెన్యూ పరిధిలో దాదాపు అరవై ఎకరాల వ్యవసాయ భూములతో పాటు 63 ఇళ్లు కాలువ నిర్మాణంలో కోల్పోతున్నాయి. న్యాలకొండపల్లి రెవెన్యూ పరిధిలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం మంజూరైంది. కాగా కొండన్నపల్లిలో ఇళ్లు కోల్పోతున్న వారితో పాటు, కురిక్యాల రెవెన్యూ పరిధిలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పటివరకు పరిహారం మంజూరు కాలేదు.

అసంపూర్తి సర్వే

ఇండ్లు కోల్పోతున్న వారికి సంబంధించిన సర్వే అసంపూర్తిగానే మిగిలి పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో భూములు, ఇళ్ల సేకరణకు రోజూ వచ్చిన అధికారులు ఇప్పుడు కనిపించడమే లేదన్నారు. పూర్తి స్థాయి సర్వే నిర్వహించి పరిహారం అందించి అనువైన చోట పునరావాసం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పరిహారం కోసం ధర్నా చేసిన నిర్వాసితులు మరోసారి ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

పరిహారం రాలేదు



కురిక్యాల రెవెన్యూ పరిధిలో వ్యవసాయ భూమి పోతుంది. రెండేళ్లు కావస్తున్నా పరిహారం లేదు. రోజురోజుకు భూముల ధరలు పెరుగుతున్నాయి. పరిహారం ఆలస్యమైతే వచ్చే డబ్బులతో పదిశాతం భూములు రావు. పరిహారం విడుదల చేయాలి.

– ఉప్పు రాయమల్లు, రైతు, కొండన్నపల్లి

సర్వే పూర్తి చేయాలి



అదనపు టీఎంసీ తరలింపునకు కాలువ నిర్మాణంలో కోల్పోతున్న ఇండ్ల సర్వేతో పాటు, ఎస్టిమేట్లు పూర్తికాలేదు. ఎస్టిమేట్లలో సైతం తేడాలు ఉన్నయి. సర్వే పనులతో పాటు, ఎస్టిమేట్లు పూర్తి చేసి పరిహారం విడుదల చేయాలి.

– తొరికొండ అంజయ్య, కొండన్నపల్లి

నిర్వాసితులకు న్యాయం చేయాలి



కాలువ నిర్మాణంలో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలి. ఇండ్లు కోల్పోతున్న వారికి పునరావాస కాలనీ ఏర్పాటు, రెండువందల గజాల స్థలంతో పాటు స్వయం ఉపాధి కోసం రూ. ఏడు లక్షలు మంజూరు చేస్తామన్నారు.

– రేండ్ల శ్రీనివాస్, వీడీసీ చైర్మన్, కొండన్నపల్లి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రామడుగు: పేదల అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. గోపాల్‌రావుపేట గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపేందుకు పనిచేస్తున్నారని, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కిష్టారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్‌గౌడ్, మండల ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మండల అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యే రవిశంకర్ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

హుజూరాబాద్: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నందగిరి మహేందర్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం ఆయన కుటుంబానికి బీఆర్‌ఎస్ యువ నాయకుడు వొడితెల ప్రణవ్ రూ. 50 వేలు అనుచరులతో అందజేశారు.

వీణవంక: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లిదండ్రులను కోల్పోవడంతో పిల్లలు రమ్య, రాజకుమార్ అనాథలయ్యారు. బొంతుపల్లి మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి విషయాన్ని రహమత్‌నగర్ కార్పొరేటర్ చదువు నారాయణరెడ్డికి తెలియజేశారు. త్రండి నరసింహరెడ్డి చేతుల మీదుగా కుటుంబానికి రూ. పదివేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జితేందర్‌రెడ్డి, చదువు కోమల్‌రెడ్డి, శ్రీనివాస్‌తో గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: మున్సిపాలిటీలోని ఆయా వార్డుల ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మంత్రి కేటీఆర్ సూచనల మేరకు వార్డు అధికారుల నియామకం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మాట్లాడారు. సమస్యలు, వాటి పరిష్కారం దిశగా 25 మంది వీఆర్వో, వీఆర్‌ఏ, ఐదుగురు బిల్ కలెక్టర్లతో కలిపి 30 వార్డులకు 30 మంది అధికారుల నియామకం పూర్తయిందని తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి పాలకవర్గం ఆమోదం తెలిపింది. 19వ వార్డులో రూ. 5 లక్షలతో మురికి కాలువ నిర్మాణం, 29వ వార్డులో రూ.2.50లక్షలతో మురికినీరు వెళ్లేందుకు పైపుల కొనుగోలు, రూ.5 లక్షలతో మురికి కాలువ నిర్మాణం, పాత రిజిస్ట్రేషన్ ఆఫీసు నుంచి రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ఇరువైపులా రూ.9 లక్షలతో మురికి కాలువ నిర్మాణం, రాబోయే వినాయక చవితి ఉత్సవాలకు రూ. 8.50 లక్షలు, రూ. 67,500 పారిశుద్ధ్య నిర్వహణ పరికరాలు కొనుగోలు, రూ. 2.50 లక్షలతో పురపాలక సంఘంకు కేటాయించబడిన వార్డు అధికారులకు కుర్చీలు, టేబుళ్లు కొనుగోళ్లకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సమ్మయ్య, కార్యాలయ మేనేజర్ రాం మోహన్ రాయ్, టీపీవో జ్యోత్స్న, ఇన్‌చార్జి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సాంబరాజు, టీపీఎస్ అశ్వినీగాంధీ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్ రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదుపై వివిధ పార్టీ నాయకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నాయకులు ప్రజలకు ఓటరు నమోదు, ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని కోరారు.

ఓటరు నమోదులో పొరపాట్లు చేయొద్దు

జమ్మికుంట: ఓటరు నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని తహసీల్దార్ రజని అన్నారు. బుధవారం కార్యాలయంలో బీఎల్‌వోలతో ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కొత్త ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, పొరపాట్లు సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు సంతోష్‌కుమార్, తిరుపతి, బీఎల్‌వో సూపర్‌వైజర్లు అనిల్, హైమవతి, కాజీమ్, సిబ్బంది రాజేందర్, స్వామి, నవీన్, రాజు, రమేశ్, సబిత పాల్గొన్నారు.

రసమయికి కళాకారుల సన్మానం


ఎమ్మెల్యే కు రాఖీ కడుతున్న విజయ

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కరీంనగర్, ఆదిలాబాద్, సిద్దిపేట, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన సాంస్కృతి సారథి కళాకారులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కళాకారులకు పీఆర్సీ అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మూడోసారి ఎమ్మెల్యేగా టికెట్ కేటాయించినందున రసమయిని సన్మానించారు. గాయని తేలు విజయ ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడుతూ.. రాష్ట్రం కోసం కొట్లాడిన కళాకారులకు తెలంగాణలో రసమయి సారథ్యంలో మొట్ట మొదటిసారిగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందన్నారు.తొమ్మిదేళ్లుగా అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఆటపాటలతో ప్రతిపల్లె తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న కళాకారుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని పీఆర్సీ అమలు చేసి కళాకారుల జీవితాల్లో వెలుగు నింపినందుకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే దివ్యాంగులకు పెన్షన్ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో దివ్యాంగులు సకల జనుల సమ్మెలో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ బసీరొద్దీన్, తహసీల్దార్ సుపమ, ఎంపీపీ సరోజన, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బావపై దాడిచేసిన బావమరిది అరెస్ట్



అరెస్టు చూపుతున్న హెడ్ కానిస్టేబుల్

తిమ్మాపూర్: ఈనెల 24న మండల కేంద్రంలోని మద్యం షాపు వద్ద మద్యం మత్తులో బావ పై దాడి చేసిన బావమరిదిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. న్యాలం తిరుపతి, తన బావమరిది బెజ్జంకి మండలం వడ్లూర్‌కు చెందిన చెక్కిల ప్రదీప్‌కు రూ. 2.5 లక్షల అప్పుగా ఇచ్చాడు. ఈనెల 24న కరీంనగర్ కోర్టుకు వెళ్లి హాజరై ఇద్దరు తిరిగి వస్తూ తిమ్మాపూర్‌లోని మద్యం షాపు వద్ద ఆగారు. ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో అప్పు విషయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో సహనం కోల్పోయిన ప్రదీప్ బీరు సీసా పగులగొట్టి తిరుపతిపై దాడిచేసి పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు మహాత్మానగర్ లో ప్రదీప్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం.. దేహశుద్ధి చేసిన స్థానికులు


దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

తిమ్మాపూర్: ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థిని మెడలోని చైన్‌ను కొట్టేసేందుకు యత్నం చేసిన ఘటన తిమ్మాపూర్ మండలం అల్గునూర్ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన నిషాని నరేశ్ కరీంనగర్ నుంచి నుస్తూలాపూర్‌కు ఆటో వెనకాల కూర్చొని ప్రయాణిస్తుండగా చేపల కాలనీ వద్ద ఆటో ఆగింది. అదే ఆటోలో ప్రయాణిస్తున్న తిమ్మాపూర్‌కు చెందిన మాదన సంధ్య అనే విద్యార్థి మెడలో నుంచి గొలుసు తెంపుకుని పారిపోయేందుకు యత్నించాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం ఎల్‌ఎండీ పోలీసులకు అప్పగించారు. ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ ప్రమోద్ రెడ్డి తెలిపారు.

రాఖీ పౌర్ణమి వేడుకలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామం ఏకశిలా పాఠశాలలో బుధవారం రాఖీ పౌర్ణమి వేడుకల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని పాఠశాల, కళాశాలల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. వీణాధరి స్కూల్‌లో కరస్పాండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

రామడుగు: గోపాల్‌రావుపేట అల్ఫోర్స్, పాఠశాలలో వేడుకలను జరుపుకున్నారు.

గన్నేరువరం: మండలకేంద్రంలో విజ్ఞాన్ కాన్వెంట్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

మానకొండూర్: మండలకేంద్రంలోని చాణక్య ఇంగ్లిష్ మీడియంలో స్కూల్ రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖీ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కరస్పాండెంట్ అడెపు రవీందర్, ఏబీవీపీ నాయకులు వెంకటసాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఏకశిలా పాఠశాలలో..


చొప్పదండి: రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు


గన్నేరువరంలో రక్షాబంధన్


రామడుగు: రాఖీ కడుతున్న చిన్నారులు


మానకొండూర్‌లో..

పౌరహక్కుల దినోత్సవం

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఉప సర్పంచ్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ చిలుక రవీందర్ మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛగా జీవించే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. కార్యక్రమంలో త్రిపాల్ సింగ్, రాజయ్య, రవీందర్, స్వరూప, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని రుద్రారంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అధికారులు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ బాలకిషన్, ఎంపీటీసీ గుర్రం దేవికరాజశేఖర్‌గౌడ్‌లతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లిలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ మూఢనమ్మకాలను ఎవరు నమ్మొద్దని, కులం పేరుతో దూషించొద్దని, ఐకమత్యంగా ఉండాలని, మానవహక్కుల పరిరక్షణకు, హక్కుల అణచివేతలేని సమాజం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

సాంస్కృతిక సారథి కళాకారుల హర్షం

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక సారథి కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 30శాతం పీఆర్‌సీ అమలుకు జీవో జారీ చేయడం పట్ల తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు రామంచ భరత్ బుధవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 583 మంది కళాకారులకు న్యాయం జరిగిందన్నారు. పీఆర్‌సీ అమలుకు కృషి చేసిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ చైర్మన్, ఎమ్మెల్యేరసమయి బాలకిషన్, భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణకు కళాకారులు సునీల్, శివ, ఆనందం, ఎండీ రహీం, శ్రీధర్, శ్రీకాంత్, యోగానంద్, సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

బోర్‌వెల్ చుట్టూ చెత్తా చెదారం



చొప్పదండి: పట్టణంలోని చిల్లవాడ సమీపంలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్ వద్ద అపరిశుభ్ర వాతావరణంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. సాధారణ బోర్ నుంచి నల్లా కనెక్షన్ ఇచ్చారని, మున్సిపల్ వాటర్ కనెక్షన్ కల్పించాలని కోరారు. డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, చెత్త పేరుకుపోతుండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని విన్నవించారు.

సెప్టెంబర్‌లో మండలస్థాయి క్రీడా పోటీలు


మాట్లాడుతున్న ఎంఈవో వెంకట నరసింహారెడ్డి

హుజూరాబాద్: పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 19, 20, 21 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నామని, దీనికి అనుగుణంగా వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సొల్లు సారయ్య,వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.